# దద్దరిల్లిన దేవలోకం!

శ్రీమహావిష్ణువు కుంభకర్ణుడి నిద్రలో వుండటం గమనించిన శ్రీమహాలక్ష్మి... భర్త మేలుకుని కాఫీ కొరకు కేకవేసేలోగా... ఎంచక్కా అభ్యంగనస్నానం చేసి రావచ్చుగదాని ఏ.సి. బాత్‌రూంలోకి దూరింది!

అశ్వనీ వారి నలుగుపిండి దట్టంగా వంటికి పట్టించి ఆలోచనలో పడింది. అలనాడు నలుగుపిండితో పార్వతి (సారీ! దేవదాసు భార్య కాదు) నలుగుపిండితో బాలుని బొమ్మచేసి దానికి ప్రాణం పోసి... బాత్‌రూమ్ గుమ్మం దగ్గర ఆ బాలుని కాపలా వుంచింది. లోనికెవరూ రాకుండా చూడమంది.

మరిప్పుడు తన వంటినవున్న నలుగుపిండితో ఏం చేయాలి? అనే ఆలోచన వచ్చిన శ్రీమహాలక్ష్మికి బ్రహ్మాండమైన ఐడియా తట్టింది.

పార్వతికి మల్లే మగబిడ్డని చేస్తే... అమ్మో కాపీరైట్స్ ఆమెవి కాబట్టి... తాను ఆమె ప్లాట్‌ని... అదే ప్లాన్‌ని కాపీ కొట్టిందనే చెడ్డపేరు తనకు రావచ్చు!

కాపీ కొట్టటం లక్ష్మీదేవికి బొత్తిగా ఇష్టంలేదు. కనుక... పార్వతి బాలుడిని నలుగుపిండితో చేసింది కాబట్టి తాను బాలిక రూపాన్ని చేసి ప్రాణం పోస్తే... ఎట్లా వుంటుందీ? అన్పించింది.

అయినా మగబిడ్డ కావాలని కన్నవారు ఆరాటపడటమేగానీ... భూలోకంలో పుత్ర సంతానం... వారి తల్లిదండ్రులనేం గౌరవించి... ప్రేమించి... కష్టకాలంలో... వృద్ధాప్యంలో ఆదుకునేడుస్తున్నారు గనుక?...

అదే ఆడపిల్ల అయితే... అమ్మానాన్నల పట్ల కన్నవారనే అభిమానం... ఆప్యాయత... మమతానుబంధాన్ని తెంచుకోలేక పేరెంట్స్ కోసం విలవిల్లాడుతుంది.

కానీ... ఆడపిల్ల అయితే అల్లుడిని వెతకాలి... కట్నకానుకలివ్వనిదే పెళ్ళికాదు. అన్నీ ఇచ్చి అత్తవారింటికి పంపినా మెట్టినింట కూడా ఇటు భర్తతో అటు అత్తమామలతో సాధింపులు... వేధింపులు! ఆపై ఆడపిల్లని రాచి రంపాన పెట్టటం... చావగొట్టి చెవులు మూయడం.. ఎన్నెన్ని దౌర్భాగ్యపు సంఘటనలు భూలోకంలో జరగటంలేదు?...

దేవలోకంలో సైతం పురుషాధిక్యత ప్రబలటం లక్ష్మీదేవి గమనిస్తోంది. అంచేత... ఆడపిల్లను చేయటానిక్కూడా సాహసించలేక... నలిచిన నలుగుపిండిని పిడకలా చేసి బాత్‌రూమ్ గోడకు కొట్టింది!

తలంటు ముగియకుండానే ఫైనల్ ఫినిషింగ్ టచ్‌లాగా... ఏ ఛానల్ ట్యూన్ చేసినా

గొంతు చించుకువచ్చే సంతూర్ సోప్ యాడ్ గుర్తు రావటంతో... సోప్‌కేస్‌లో వున్న సంతూర్ సబ్బుని వంటికి పట్టించి సుతారంగా వళ్ళు రుద్దుకో నారంభించింది!

పీడకలేదైనా వచ్చిందేమో శేషసాయిమీద పడుకుని మాంఛి నిద్రలో వున్న శ్రీహరికి మెలకువ రావటంతో తటాలున లేచి కూర్చున్నాడు.

పాదాలవద్ద శ్రీమహాలక్ష్మి లేకపోవటంతో శ్రీమతి ఎక్కడికి వెళ్ళివుంటుంది చెప్మా అనుకుని ... బహుశ కిచన్లో బ్రేక్‌ఫాస్ట్ తయారు చేస్తూండవచ్చని తలపోసాడు.

తనకు బెడ్‌కాఫీ కావాలని ఆ మహాతల్లికి (సారీ ...శ్రీమహాలక్ష్మికి) తెలుసు కదా... మరి మేలుకునే సమయానికి పక్కనే (సారీ కాళ్ళవద్ద) లేకుండా వంటింట్లో వుండటమేమిటి?... భర్త ఎడల ఇంత నిర్లక్ష్యమాని కించిత్ కోపగించుకున్నాడు.

సరేపోనీలే... ఈరోజైనా నా పేస్ట్‌తో పాచి పళ్ళు తోమి మరీ కాఫీ తాగటానికి సిద్ధపడి... పేస్ట్ బ్రష్ బాత్‌రూమ్‌లో గల వాష్‌బేసిన్ దగ్గరున్నాయనే సంగతి గుర్తుకొచ్చి బాత్‌రూమ్ వేపు దారితీశాడు శ్రీహరి.

బాత్‌రూమ్ సమీపించగానే సుగంధ పరిమళ సువాసనలు నాసికాపుటాలకు తాకటంతో... బహుశా...పనిమనిషి బాత్‌రూమ్‌ని సెంట్‌తో శుభ్రం చేసిందేమోని భ్రమించినవాడై... బాత్‌రూమ్ తలుపు నెట్టగా... లోపల గడియపెట్టి వుండకపోవడంతో బార్లాగ తలుపు తెరుచుకుంది.

అర్ధాంగి వంటిమీద నూలుపోగైనా లేకుండా అభ్యంగనస్నానమాచరించుట కళ్ళబడటంతో ఆమె అందచందాలకు మోహితుడై... ఆకర్షితుడై మెల్లగ పిల్లిలా... శ్రీమహాలక్ష్మిని సమీపించాడు.

సరిగ్గా అదే సమయానికి లక్ష్మీదేవి సబ్బుతో ముఖము రుద్దుకుంటున్నందువల్ల... ముఖమంతయూ సబ్బు నురగతో వున్న కారణాన... శ్రీహరి ఎంటరవటం గమనించలేక పోయింది.

భార్యనే నఖశిఖపర్యంతం చూస్తూంటే శ్రీహరి పళ్ళు పులిసి... ఆలోచనలు పూర్వ దిగంతాలకు దొర్లినయ్.

ఆహా! ఏమి సౌందర్యము? అనుకుంటూ లొట్టలేసుకుంటూ ఆమెను సమీపించి తన బాహువుల్లో బంధించే ప్రయత్నం చేస్తూన్న క్షణాల్లో నీళ్ళు ముఖాన చల్లుకున్న లక్ష్మీదేవి కళ్ళు తెరచి తలపక్కకు తిప్పి 'ఓ!... మీరా నాథా? ఆడవారు స్నానము చేయుచున్నప్పుడు మగవారు రాతగునా...?' నొసలు చిట్లించి చిరుకోపము ప్రదర్శించి ప్రశ్నించింది.

'నేను తప్ప లోనికి ఇతరులెవరు రాగలరు దేవీ?... నీవు నాకే సొంతం? అవునూ... నీ వీపు రుద్దమందువా...?' కొంటెతనం శ్రీహరి మాటల్లో తొంగిచూచింది.

'ఛీ! సిగ్గులేదూ? అన్నీ చిలిపిచేష్టలే... కృష్ణావతారము ఎత్తినపుడు చేసిన ఆగడములు

ఇంకనూ మరువలేకుంటిరా...? లేక పాత మధురస్మృతులు గుర్తుకొచ్చినవా?...'

'అది సరే దేవీ... నీవు పాలతో కదా స్నానము చేయవలసినది. మరి... ఇపుడు... నీటితో స్నానమొనరించుచుంటివేల?...' హాశ్చర్యము ప్రకటించెను.

'తమరు వీపు రుద్దుట ఆపండి!... దానికి తోడు ఈ చక్కిలిగింతలేల?... మీరెరుగరా?... మన క్షీరసముద్రము ఎండిన కారణముగ... పాలు నిండుకున్నవి. అందుచేతనే నీటితో స్నానమొనరించుచుంటిని...' చెప్పి ఫక్కున నవ్వింది.

'నీటికినీ కొరత ఏర్పడినట్టు కన్పించుచున్నది... ఇది ఏమి దౌర్భాగ్యము?' సబ్బు చేతులు కడుగుకొనుచూ శ్రీహరి తన మనసులో సందేహాన్ని వెలిబుచ్చాడు.

'శివుని జటాజూటమున గల గంగ కూడా లేదు. సకాలంలో వర్షాలు కురవనందున జలాశయములన్నీ ఎండినవి. పంట పండించు రైతులు సైతము... నీరు లేక వర్షాధార పంటలు పండించలేక విలవిలలాడుచుండిరి! కరెంట్ ప్రొడక్షన్ పడిపోయినది. మరల విసనకర్రల కాలము వచ్చె! అన్నదాతల ఆత్మహత్యలు ఎక్కువాయె... ఆ వరుణుడినొకసారి పిలిపించి సకాలములో వర్షించి ఋతుధర్మము కాపాడమని మందలించండి! లేకున్న భూలోకమున మానవకోటియేకాదు... దేవలోకమున సైతము అన్నింటికీ కటకట ఏర్పడును...' వళ్ళు టర్కీ టవల్తో తుడుచుకుని... చీరె ధరిస్తూ మనసులో మాట భర్తతో చెప్పింది.

లక్ష్మీదేవి తాను ఆమెతో సరససల్లాపములాడుటకు చనువీయక పోవటంతో నిరాశతో నిస్పృహతో... బరువెక్కిన హృదయముతో... బాత్రూమ్లోంచి శ్రీహరి ముఖం వ్రేలాడేసుకుని బైటకొచ్చెను.

★ ★ ★ ★ ★

కంట్రీక్లబ్లో 'రంభ-ఊర్వశి-మేనక'ల డ్యాన్స్ ప్రోగ్రాం ఉందని ఇన్విటేషన్ రావటంతో... వెళ్ళకపోతే ఇంద్ర మహాశయుడికి ఎక్కడ కోపం వస్తుందోని లైఫ్ పార్ట్నర్ లక్ష్మీదేవికి చెప్పకుండా శ్రీహరి తుర్రుమన్నాడు.

ఎప్పుడూ శేషపాన్పుపడకసీను తప్పించి మరో పనిలేకపోవటంతో... పడుకుని పడుకుని బెడ్సోర్స్ డెవలప్ అవుతాయోని బెంగతో... దొరక్క దొరక్క దొరికిన ఒకే ఒక్క ఛాన్స్ డాన్స్ ప్రోగ్రాం కదాని. .. కాస్తంత రిలాక్స్డ్గా వుంటుందనిన్నూ... కాస్తంత లక్ష్మీదేవి ముఖం చూచి బోర్ కొట్టిన కారణం మూలాన... హుషారుగా కునేగా సెంట్ వంటినిండా స్ప్రే చేసుకుని ప్రోగ్రాంకి పోవటానికి గరుత్మంతుడి వాహనం వాడుకోకుండా కాలి నడకనే బయల్దేరెడు శ్రీమన్నారాయణుడు.

తాను పరాయి పడతుల డ్యాన్స్ ప్రోగ్రాం చూడటానికి వెళ్ళినట్టు... తర్వాత లక్ష్మికి తెలిస్తే?... ఎంత ప్రమాదం? కొంపలంటుకుటయ్యన్పించినా బేపర్వాగ కాస్తంత

మొండిధైర్యాన్ని కూడదీసుకుని మరీ వెడుతున్నాడు శ్రీహరి.

అయినా ఓ ఆడదానికి... కట్టుకున్న భార్యే కావచ్చు... మగాడైవుండి భయపడటమేమిటీ అనేసి తన్లో తాను కంట్రీ క్లబ్‌కి వెడుతూ ప్రశ్నించుకున్నాడు.

శ్రీహరి అక్కడికి చేరుకునే సమయానికే ఓపెన్ ఎయిర్ థియేటర్ ప్రేక్షకులతో కిటకిటలాడుతూండటం గమనించి... తీరా తాను వెడితే ఫ్రంట్ 'రో'లో సీటు కేటాయింపబడి (వి.ఐ.పి. కనుక) వుంటుందో లేదోనే శంక శ్రీహరిని పీకింది.

ఇంతలో... బ్రహ్మ... ముక్కంటి ఎదురొచ్చి 'రండి మహాశయా... మీకోసమే నిరీక్షణ...' ఆహ్వానం పలికారు.

మొదటి వరుసలో స్టేజి దగ్గరగా వున్న మూడు ఖాళీగా వున్న సీట్లలో త్రిమూర్తులు ముగ్గురూ ఆశీనులైనారు.

సీట్స్‌లో సెటిలైన మరుక్షణంలోనే 'డ్యాన్స్' మొదలైంది. కనీవినీ ఎరుగని రీతిలో ఆ ముగ్గురూ ... అదే రంభ... ఊర్వశి... మేనకలు నృత్యం చేస్తూ ప్రేక్షకులను అలరిస్తూ... మైమరపిస్తున్నారు.

గంటసేపు డ్యాన్స్ ప్రోగ్రాం రెప్పపాటులో ముగిసినట్టే అన్పించింది ఆహ్వానితులందరికీ!

ప్రోగ్రాం ముగియగానే ఇంద్రుడు గబగబా త్రిమూర్తులను సమీపించి 'మీరు వెళ్ళిపోకండి... మన నలుగురికీ మాంఛి మందు పార్టీ ఏర్పాటు చేసాను. (అఫ్‌కోర్స్ మధ్యపానం హానికరం అనే టేపొచ్చిందనుకోండి...టి.వీలో)... కాస్తంత గొంతు తడుపుకున్న తర్వాత విందారగించి మనం డిస్పర్స్ అవుదాం...' చెప్పటంతో కొంచెం ఇబ్బందిగా ముఖాలు పెట్టినా అమృతాన్ని ఎంత త్వరగా గ్రోలటమాని మనసు... తొందరపెట్టటంతో... నలుగురూ ఏకమై వడివడిగ ముందుకు అడుగులేశారు.

క్షీరసాగర మధనమప్పుడు... ఎప్పుడో... దేవతలందరికీ అమృతాన్ని పోసి... వారు సేవించగా చివరికి మిగిలిన లక్కీ డ్రాప్స్ శ్రీహరి పుచ్చుకున్నాడు (సారీ... ఆడవేషం తీసేశాక). అది సుతా మళ్ళీ మధిర ముట్టుకోనేలేదు.

అందుకే... ఎంత త్వరగా పుచ్చుకుందామాని శ్రీహరి మనసు ఆరాటంతో వేగిరపడుతోంది!

అప్పటికే మేకప్ తుడిచేసుకున్న రంభ-ఊర్వశి-మేనకల్తో ముగ్గురూ... వొయ్యారాలొలకబోస్తూ తమ బాస్ ఇంద్రుడిని... వెంట వచ్చే త్రిమూర్తులకు ఆహ్వానం పలకడం చూచి త్రిమూర్తులు బిత్తరపోయారు.

ముగ్గురు మగువలు... నలుగురికీ అమృతాన్ని అందించారు. సేవిస్తున్న అమృతంకంటే సర్వ్ చేస్తున్న అందాల భరిణలను చూస్తుంటేనే త్రిమూర్తులకు 'కిక్కు' త్వరగా వస్తున్నట్టన్పించింది.

అందరూ... మందు లిమిటెడ్‌గానే తాగేక... పడతులు వడ్డించిన మృష్టాన్న భోజనాన్ని కడుపార అరగించి... బ్రేవ్‌మని త్రేన్చి 'ఇంతేనా... ఈ రెంటి తర్వాత మూడవది కూడా ఏమైనా వుందా?...' అనే ధోరణితో త్రిమూర్తులు ముప్పురూ దేవేంద్రుడి వేపు మత్తులో... గమ్మత్తుగ చూశారు.

★★★★★

హేంగోవర్ లేకపోవటాన శ్రీహరి నడుచుకుంటూనే వైకుంఠం చేరుకుని శేషపాన్పుపై పరుండి గాఢనిద్రపోయి ... తెల్లవారి కళ్ళు తెరిచి... లక్ష్మీదేవి కోసం లేచివెళ్ళి పేలస్ అంతా గాలించి... కన్పించనందుకు నిరుత్సాహపడి తానే కిచన్లో కెళ్ళి కాఫీ తయారు చేసుకుని తాగేడు.

ఈ మహాతల్లి... అదే తన అర్ధాంగి... జీవిత భాగస్వామి... దేవేరి ఎక్కడా కన్పించదేం చెప్మా... అనేసి మధన పడసాగేడు శ్రీహరి.

నాలుగురోజులు గడిచినా లక్ష్మీదేవి వైకుంఠానికి తిరిగి రాకపోవటంతో శ్రీహరికి అరికాలిమంట నెత్తికెక్కింది. తనతో చెప్పకుండా వైకుంఠాన్ని విడిచి వెళ్ళిందికాక... ఇన్నాళ్ళైనా జాడ తెలీపర్చనందుకు చిర్రుబుర్రులాడుతున్నాడు.

త్రిలోక సంచారియైన నారదుడు శ్రీమహావిష్ణువును సమీపించి 'నారాయణ!... నారాయణ!... ఆడవాళ్ళు ఇంతకి బరితెగిస్తారని... పురుష పుంగవులు కల్లోనైనా వూహించివుండరు...' వాపోయాడు.

'నీ సోది ఆపి కాస్తంత అర్థమయ్యేటట్టు చెప్పేడు...' సీరియస్‌గా అన్నాడు శ్రీహరి.

'మన్నించండి.... మన్నించండి!... ఈ పాపిష్టి నోటితో ఆ నిజాన్ని చెప్పలేను...'

'చెప్పటం ఇష్టంలేనివాడివి నా దగ్గరకెందుకొచ్చినట్టు?... వెళ్ళు!... తక్షణమే నిష్క్రమించు! నీ ముఖ మళ్ళీ నాకు చూపకు...' విసుక్కున్నాడు.

చేతులు పిసుక్కుంటూ 'ఏమని చెప్పెద దేవా? మా లక్ష్మీమాత భూలోకమున కన్పించినది. అందునా ఎక్కడనుకుంటురి? ... హవ్వ... సిగ్గు సిగ్గు... అతివల అందాల పోటీలో అమ్మగారు కూడా పాల్గొనుట నా కళ్ళారా చూశాను దేవదేవా?...'

నారదుని మాటలు విన్న శ్రీహరికి వళ్ళుమండింది! తోక తొక్కిన తాచులా బుస్సుమన్నాడు.

'కేవలం తమరి భార్యే కాదండీ... శివుని సహధర్మచారిణి పార్వతి అమ్మ... బ్రహ్మ మానసపుత్రిక అయిన సరస్వతీదేవి... దేవేంద్రుని అర్ధాంగి... అంతా కట్టగట్టుకుని అక్కడే కన్పించారు...'

ఆ వార్త విన్న శ్రీహరి కడుపు భగ్గున మండి 'రానీ... చెప్తానామె సంగతి! రానురానూ

మరీ బరి తెగించి ప్రవర్తించుచున్నది!... తగినబుద్ధి చెప్పాల్సిందే...' అంటూ రెచ్చిపోయాడు శ్రీహరి.

శ్రీహరి గరమ్‌గా వున్నాడని గ్రహించిన నారదుడు మెల్లగా సీన్లోంచి తప్పుకు వెళ్ళిపోయాడు.

చీకటి పడు సమయానికి తన వెంట వచ్చిన పార్వతికి సరస్వతికి... అరుంధతి... అనసూయాది పతివ్రతలకు 'బై' చెప్పి శ్రీమహాలక్ష్మి వైకుంఠానికి కొచ్చి డ్రెస్ మార్చుకుని తాను కైవశం చేసుకు తెచ్చుకున్న అందాల సుందరి వజ్ర కిరీటాన్ని అద్దాల షెల్ఫ్‌లో భద్రపరిచి... రిలాక్సవుతుండగా... శ్రీహరి సీన్లోకి ఎంటరైనాడు.

లోనికి వస్తున్న శ్రీహరికి ఎదురువెళ్ళి 'నేను అందాల సుందరి పోటీల్లో గెలిచాను నాథా! ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనుటే తదుపరి కార్యక్రమం...' సంబరపడుతూ చెప్పింది శ్రీమహాలక్ష్మి.

'నాతో మాట మాత్రమైనా చెప్పకుండా... కన్పించకుండా వెళ్ళిపోయి నువ్వు చేసిన నిర్వాక మిదా...?' కోపంతో రెచ్చిపోయిన శ్రీహరి సహధర్మచారిణి చెంపలు రెండూ వాయించాడు.

లక్ష్మీదేవి సుకుమార వదనము కందగడ్డ అయినది. భర్త కొట్టుటచేత రెండుబుగ్గలూ బూరెలాయెను.

'ఆడదానిమీద చేయిచేసుకుంటారా? అర్ధాంగినైన నన్ను కొడతారా? మీకు సిగ్గులేదా? మీ పురుషాహంకారము... దురహంకారము చూచుచూ ఊరకుండలేను! ఆడవారంటే అంత చులకనభావమా? మీ ఆగడములు ఇకపై సహించను! తోటి మహిళా దేవతలందరినీ సమీకరించి... నిరసన ప్రదర్శనలు జరిపించెదను. పురుషదురహంకారానికి తగిన గుణపాఠము చెప్పెదను...' గుడ్లురుముతూ... పళ్ళు పటపట కొరుకుతూ రుద్రకాళి అవతారమెత్తినట్టు శ్రీహరిని మాటలతో ఎడాపెడా వాయించింది.

పోయిపోయి భార్యపై చేయిచేసుకుని తొందరపాటుతో ఇరుకున పడితినే అని మనసులో శ్రీహరి చింతించుచూ వైఫ్‌కి 'సారీ' చెప్ప నిర్ణయించుకున్నారు.

మహిళాలోకాన్ని మేల్కొలుపుతాను. స్త్రీ స్వాతంత్ర్యాన్ని హక్కులను నేలరాసి కాలరాచే మిమ్ము పదిమందిలో నవ్వులపాలు చేస్తాను. అప్పుడుగానీ... మీ మగవారు కాళ్ళబేరమునకు రారు!... అంతవరకు ఇంటి గడపతొక్కను' అని శపథం చేసిన శ్రీమహాలక్ష్మి మహిళాభ్యుదయ సంఘం ఆఫీసువైపు వడివడిగ నడుచుకుంటూ వెళ్ళెను.

శ్రీహరి తన తొందరపాటు తెచ్చిన ఉపద్రవానికి చింతిస్తూ తలపట్టుకుని తన సుఖాసనముపై కుప్పకూలేడు.

- సమాప్తం -